# అక్షింతలు

"అమ్మా ! నన్ను దీవించవూ ! ఈ అలంకరణలో నేనెంత బాగున్నానో చూడవూ ! నీలాగే ఉన్నాను కదూ !"

చేమంతి పూవుల జడ, చేతుల నిండాగాజులూ ఎరర్రటి పట్టు చీరపైన పెద్ద పెద్ద జరీపూలతో కుందనపు బొమ్మలా మేరిసి పోతూన్న శీమంతపు పెళ్ళికూతురు, సుమతి, తల్లి ఫోటో దగ్గర నుంచొని కన్నీళ్లు నింపుకుంటూ, ఈమాటలు మరిమరీ అనుకుంటోంది.

గదిలో తివాసీ పరచి "పేరంటాళ్లు వచ్చే వేళ అయింది. అక్క ఎక్కడుందో" అనుకుంటూ ఇల్లంతా సుమతి కోసం వెదకి, „ఇక్కడున్నావా, అక్కా" అంటూ, పరుగెత్తి వెళ్ళి అక్క చెయ్యి పట్టుకుంది శాంతి. ఏడ్చి ఎరుపెక్కిన కళ్లు, ముఖమంతా కాటుక చారలతో, మబ్బుల చాటున చంద్ర బింబంలా ఉన్న సుమతి ముఖం చూచి, బాధగా, "ఏడుస్తున్నావా అక్కా !" అంటూ తన మెత్తని చేతులతో సుమతి కళ్ళు తుడిచింది, శాంతి. శాంతిని చూసీ చూడడంతోనే మరింతగా పొంగి వస్తున్న దుఃఖాన్ని అణుచు కుంటూ, "లేదమ్మా ! ఏడవడం లేదు. ఆకాంశలో ఉన్న అమ్మను దీవించమని అడుగుతున్నాను " ఎంత ప్రయ-త్నించినా సుమతి మాటలు పలికేటప్పుడు గొంతులో దుఃఖమే ధ్వనించింది.

,,మళ్ళీ నువ్వు కన్నీళ్లు పెట్టుకుంటే నా మీద ఒట్టే ! ముఖం కడుక్కోనిరా" సుమతిని పంపించింది. తల్లి ఫోటో వంకచూస్తూ ,,అమ్మా అక్కయ్యను దీవించావు కదూ ! అమ్మమ్మవు కాబోతున్నావు నువ్వు. మా అందరిని వదలి వెళ్లిపోయేవు. నువ్వుంటే ఎంత బాగుండును." ఇలా బాధ పడుతున్న శాంతి, సుమతి పిలుపుకి ఉలిక్కిపడి, పైట చెంగుతో కళ్లు వత్తుకునీ హాల్లోకి వెళ్లిపోయింది శాంతి. పన్నీరు బుడ్డి, గంధపు గిన్నె, వగైరా వస్తువులన్నీ టేబులు పైన సర్దుతూ ఉన్న శాంతి ,,బామ్మా ! అక్షింతలు కలపడం మరచి పోయావు" అంది. ఆమాటలకు జ్యోతికి జడ వేస్తున్న సుభద్రమ్మ పరిసరాలను మరచి, నిశ్చేష్టురాలై ఉండి పోయింది. "నాకు కొంచెం పూవులైనా పెట్టవూ బామ్మా" అంది తన గారాల చిన్న మనుమరాలు, జ్యోతి. జ్యోతి జడ పూర్తిచేసి, పూలు పెట్టి అలాగే కూర్చుండి పోయిన బామ్మతో, "అందరూ వచ్చేస్తున్నారు. త్వరగా అక్షితంలు కలిపి తీసి కొచ్చేయి బామ్మా !" అంది పళ్లేలతో వాయనాలు సర్దుతున్న జయంతి.

"ఆ ! అక్షింతలు ! అక్షింతలు ! ఈ అక్షింతలే అప్పుడూ మరచిపోయేను" అనుకుంటూ వంటింట్లోకి అక్షింతలు కలపటానికి వెళ్లేరు సుభద్రమ్మగారు. పళ్లెంలోకి బియ్యం తీసి పసుపులో చెయ్యిఉంచి, "అక్షింతలు కలపాలి ! పార్వతి శీమంతానికి ఇవే మరచి పోయాను. అందుకే నేమో పార్వతి అలా అయిపోయింది."

సుభద్రమ్మ ఆలోచనలు పాతికేళ్ల గతంలోకి మళ్లేయి "పార్వతి తనకు కోడలే అయినా కన్న కూతురు లాంటిది. భగవంతుడు తనకు ఆడపిల్లలను ప్రసాదించకపోయినా, తన ఒక్కగానొక్క కొడుకైన పరమేశం ఇల్లాలుగా అడుగు పెట్టి తనకు ఆడపిల్లలు లేని కొరత తీర్చింది, పార్వతి. పార్వతీ తనూ, అత్త కోడళ్ల లాగ ఉండేవారు కాదు. చూసిన వాళ్ళంతా తల్లీ కూతుళ్ల లాగ ఉన్నారు అనుకునే వారు. తనకి ఆడపిల్లలు లేకపోవడంతో, పార్వతినే కన్న కూతురి-లాగ చూకొనేది. పార్వతి మాత్రం తనకెప్పుడైనా ఎదురు చెప్పిందా ? అందుకే నేనేమో భగవంతుడు ఓర్చలేక పార్వతిని దూరం చేసేడు."

ఇలా ఏవేవో ఆలోచిస్తూ, అక్షింతలు కలపడం పూర్తి చేశారు, సుభద్రమ్మగారు. "ఆ నాడు పార్వతి శిమంతానికి ఇలాగే అక్షింతలు కలపడం మరచిపోయాను అందుకనే నేమో పార్వతి అలా అయిపోయింది". ఈ ఆలోచన సుభద్రమ్మగారి మనసులో మెదిలిన మరుక్షణమే మాయ మైంది. "కాదు ! పార్వతి అలా అయిపోవడానికి తను కాదూ కారణం !

ఆ రోజు తనేమని దీవించింది ! పదిమంది పిల్లలని కని పచ్చగా కాపురం చేయమని దీవించింది. మొదటి పాప సుమతి పుట్టినప్పుడు ఆడపిల్ల లక్ష్మి అని మురిసి పోయింది. రెండవ మనుమరాలు పుట్టినపుడు, వంశోద్ధార-కుడయిన మనుమడు పుట్టలేదని బాధపడింది. శాంతి పుట్టినపుడు "అత్తగారూ ! అబ్బాయిలైనా అమ్మాయిలైనా

ఈ ముగ్గురూ మనకు చాలు" అన్న పార్వతి మాటలకు తనేమంది ? పది మంది పిల్లలు ఉంటేనే ఇల్లు కళకళ లాడుతుంది. అయినా మగబిడ్డ ఒకడైనా లేకపోతే ఎలా !" అనేసింది. పార్వతి నాలుగవ బిడ్డను ప్రసవించి నప్పుడు "ఆడ పిల్లయితేనే మమ్మా ఈ నలుగురు చాలమ్మా ! ఏ మంటావు" అన్న పరమేశం మాటకు ఊరుకుంది. ఆ ఆసాయంకాలం పార్వతి ఈ విషయం ప్రస్తావించినప్పుడు తానెంత మూర్ఖంగా ప్రవర్తించింది ? ఎంత నిష్ఠూరంగా మాట్లాడింది ? " మీ ఇష్టమొచ్చినట్టే చెయ్యండి. నేనెంత ప్రేమగా చూసుకుంటున్నా "నువ్వు నా కన్న కూతురివా ఏమిటి నామాటకు విలువ ఇవ్వడానికి?" ఆ మాటలకు పార్వతి సహించ లేకపోయింది, 'మీకు ఎప్పుడూ ఎదురు తిరగను అత్తయ్య' అంది. అయిదవ సారికూడ ఆడపిల్లే పుట్టినా పార్వతి, పరమేశం కూడా ఆమెకు ఎదురు చెప్పలేదు కాని ఆవిడతో "ఈసారి కాన్పు వస్తే మీ కోడలు మీకు దక్కడం కష్టం అంది" డాక్టరు. ఆ మాటలకు "అలాంటి దేమి జరగ కూడదు, భగవంతుడా" అని దేముడికి మొక్కు కుందీ, కాని తన మూర్ఖత్వాన్ని విడువలేదు. ఫలితం ! తన కోరిక తీర్చి, వంశోద్ధారకుడైన మనుమడిని చేతుల్లో పెట్టి శాశ్వతంగా కన్ను మూసింది పార్వతి.

బిడ్డలకూ, భర్తకూ పార్వతిని, దూరంచేసిన పాపా-త్మురాలు తను ! అప్పుడు తన మాటలను ఎదిరించి ఉంటేనే బాగుండును పార్వతి. తన బిడ్డకూ మనుమలకూ ఈ అన్యాయం జరిగక పోయేది తన మూర్ఖత్వం వల్లనే ఇంత

జరిగింది, కాని అనాడు "అక్షింతలు" మరచి పోవడం వల్ల కాదు ! భగవంతుడు చేసిన అన్యాయమూ కాదు ! ఇప్పటికైనా తను మారాలి. తన దీవెన మార్చుకోవాలి. అలా అనుకొని అక్షింతల పళ్ళెం చేతిలోనికి తిసికొని సుమతిని ఎలా దీవించాలో మరీ మరీ మననం చేసుకుంటూ పేరంటాళ్ళున్న గదిలోనికి అడుగు పెట్టేరు, సుభద్రమ్మగారు. తల్లి కాబోతున్న ఆనందం అంతా కళ్లలో ప్రతిబింబిస్తూ "బామ్మా! అంక్షితలు నువ్వే ముందు వెయ్యవూ!" అన్నట్లుగా చూస్తున్న సుమతి, దగ్గరకు వచ్చి „ఒకరిద్దరు చక్కని పిల్లలతో ముచ్చటగా కాపురం చెయ్యమ్మా" అంటూ అక్షింతలు వేసి సుమతిని దీవించే సరికి పక్కింటి వాసంతి "భలే! బాగుంది, బామ్మగారూ మీదీవెన మారింది" అంది. చిలిపిగా.

"దీవెన మారటంకాదమ్మా దీవించడం ఎలాగో ఇప్పుడే అర్థంచేసుకున్నాను", అన్న బామ్మగారి మాటలకు „పెద్ద-లంతా మీలా అనుకొని ఆశీర్వదిస్తే మనదేశం నిత్యకళ్యాణం పచ్చతోరణమై అందరి జీవితాల్లో సుఖ శాంతులు చోటు చేసికుంటాయి." అంది వాసంతి, ఆమాటలకు పేరంటా-ళ్లంతా నవ్వుకుంటూ బామ్మగారి లాగే దీవిస్తూ సుమతిపై "అక్షింతలు" చల్లారు.

★

„యోజన"
(డిసెంబర్ 1976)
ప్రచురితం.